క్లుప్తంగా

1న మెగా జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ సంస్థ ఆధ్వర్యంలో మార్చి 1న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 18కి పైగా కంపెనీల్లో 4వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నమని చెప్పారు. 10వ తరగతి నుంచి ఐటీఐ, బీఈ, బీటెక్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదవి, 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. సూచించిన తేదీన ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ సమీపంలోని ప్రమీద కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, అర్హులైన వారు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పన్ను సకాలంలో చెల్లించండి



రసీదు అందజేస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: ఇంటి పన్ను సకాలంలో చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి కోరారు. గురువారం పుర కార్యాలయంలో పన్ను చెల్లించడానికి వచ్చిన ఓ వ్యక్తిని ఆయన అభినందించారు. పన్ను చెల్లించకుండా తప్పించుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో.. సీఆర్ఆర్, సీడీఎఫ్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.35 లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.35 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే పూర్తి చేసి, ప్రజా సౌకర్యాలను మెరుగుపరుస్తామని తెలిపారు. రూ.1.30 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, యాదయ్య, జంగయ్య, కృష్ణ, శ్రీను, కృష్ణయ్య, శ్రీకాంత్, రామకృష్ణ ఉన్నారు.

కళాశాలను పరిశుభ్రంగా ఉంచాలి



కళాశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని కళాశాలను ఆయన పరిశీలించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ తిరుపతయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

మహేశ్వరం: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పలు అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నామని పీఏసీఎస్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పాల్గొననున్నారని తెలిపారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. నిర్వహణ లేక కొన్ని నిరుపయోగం కాగా.. మరికొన్ని చోట్ల మైదానాలను తీర్చిదిద్దినప్పటికీ.. క్రీడా పరికరాలు సమకూర్చలేదు. ఫలితంగా వినియోగం లేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.



ముద్వీన్ క్రీడా ప్రాంగణం

నిర్వహణలేక నిరుపయోగం

- పిచ్చిమొక్కలతో మైదానాల దర్శనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఆటగాళ్లకు ఆధరణ కరవు

కడ్తాల్: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాలు, మండల కేంద్రాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో క్రీడాకారులకు సౌకర్యంగా ఉన్నప్పటికీ.. పట్టించుకునే వారు లేక అత్యధిక ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో దర్శనిమిస్తున్నాయి. మరి కొన్ని గ్రామాల్లో సరైన స్థలం లేక అసలు మైదానాలనే ఏర్పాటు చేయలేదు. కడ్తాల్ మండల పరిధి 24 గ్రామాల్లో 5 పంచాయతీలు కడ్తాల్, ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ఛరికొండ, గడ్డమీదితండా మినహా.. మిగతా 19 జీపీల్లో ఒక్కో ప్రాంగణానికి రూ.లక్షకు పైగా వెచ్చించి ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ వాటి గురించి జీపీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి, ఆటగాళ్లకు అసౌకర్యంగా మారాయి. ఆ మైదానాల్లో ఇప్పటి వరకు ఎక్కడా క్రీడలు నిర్వహించిన దాఖలాలు లేవని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

బోర్డులకే పరిమితం

గత ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి అధికారులు ఒత్తిడి నేపథ్యంలో పలు గ్రామాల్లో అందుబాటులో ఉన్న స్థలాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. మరి కొన్ని పంచాయతీల్లో ఊరికి దూరంగా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో నిర్వహణ కొరవడింది. ఇంకొన్ని చోట్ల చదును చేసి వదిలేశారు. మరి కొన్ని చోట్ల పాఠశాల మైదానాల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరి కొన్ని చోట్ల వెంచర్ లే అవుట్ 10శాతం భూముల్లో ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాంగణాల్లో.. పాఠశాల సమయంలో యువత క్రీడలు ఆడలేని పరిస్థితి. చాలా చోట్ల క్రీడా సామగ్రిని సమకూర్చలేదు.

ఖోఖో, కబడ్డీ, వాలీబాల్..

మైదానాలు ఏర్పాటు చేసినప్పటికీ.. క్రీడా పరికరాలు లేక పోవడంతో క్రీడాకారులు ఆటలపై ఆసక్తి చూపలేకపోతున్నారు. మైదానాలను గ్రామానికి సమీపంలో సుమారు ఎకరం స్థలంలో ఏర్పాటు చేసి, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్ తదితర కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి, మైదానాలను ఆటలకు అనువుగా తీర్చిద్దాలని, అదే సమయంలో పరికరాలు సమకూర్చాలని కోరుతున్నారు.

ప్రోత్సహించాలి



క్రీడా ప్రాంగణాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించాలి. సాధన చేసేందుకు వీలుగా క్రీడా కిట్లను అందజేయాలి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– గంట నరేశ్, ముద్వీన్ గ్రామం

నిధులు కేటాయించాలి



మైదానాలను అభివృద్ధి చేసి, క్రీడా కారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. యువత, విద్యార్థులు ఖాళీ సమయాల్లో క్రీడలు ఆడుకునేందుకు వీలుగా ప్రాంగణాలను తీర్చిదిద్దాలి. ఆటల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– సీహెచ్ మహేశ్, క్రీడాకారుడు, కడ్తాల్

వసతులు కల్పిస్తాం



క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తాం. నిధులు లేని గ్రామాల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. క్రీడా సామగ్రిని సమకూర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాం.

– సుజాత, ఎంపీడీఓ, కడ్తాల్

జనసంద్రమైన మల్లప్పగుట్ట

ఘనంగా బ్రహ్మోత్సవాలు, కడవ ఉత్సవం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలోని మల్లప్పగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు కడవ ఉత్సవం నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, స్వామివారికి అభిషేకం చేశారు. ఉత్సవంలో భాగంగా చుక్కాపూర్, చెన్నారం, ఖానాపూర్, ఎడవెల్లి, మంగళపల్లి, వితాయిపల్లి, పడకల్ తదితర గ్రామాల నుంచి భక్తులు నైవేద్యంతో కూడిన కడవలను తలపై పెట్టుకుని పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గుట్టపైకి చేరుకుని స్వామి వారికి కడవలను సమర్పించారు. భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఏమిరెడ్డి కౌసల్య, అధ్యక్షుడు మ్యాకం పాండయ్య, గౌరవ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, కార్యదర్శి మల్లారెడ్డి, అడ్వైజర్ శేఖర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి కడవ సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఇంటర్న్‌షిప్ పథకాన్ని వినియోగించుకోండి

మంచాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాలశంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 12 నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, శిక్షణ కాలంలో నెలకు రూ.5వేలు, వన్‌టైం గ్రాంట్ రూ.6 వేలు అందజేస్తుందన్నారు. బీమా కవరేజ్ ఉంటుందని వెల్లడించారు. 10, 12, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమా లేదా గ్రాడ్యుయేషన్ చదివి ఉండి, 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని వివరించారు. గత సంవత్సర కుటుంబ ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 1800116090 టోల్ ఫ్రీ నంబర్‌ను సందర్శించాలని సూచించారు.

భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలోని మల్లప్పగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భారతి సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ సమీపంలో సంస్థ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ తిప్పిరెడ్డి కొండల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏటా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్, టెక్నికల్ మేనేజర్ సునీల్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ భరత్ కుమార్, సంస్థ డీలర్లు కరుణాకర్‌రెడ్డి, రాజు, నితిన్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కొండల్‌రెడ్డి

ప్రజాసేవే ఫౌండేషన్ లక్ష్యం

ఇబ్రహీంపట్నం: ప్రజాసేవే ఫౌండేషన్ లక్ష్యమని, నిరుపేదలకు 'సపోర్ట్ ఫర్ లైఫ్ ఫౌండేషన్' అండగా నిలుస్తుందని ఫౌండేషన్ చైర్మన్ బి.యాదగిరి అన్నారు. వినోబానగర్‌లోని మాతా పితరుల సేవా సదనంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్స్, నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకుని ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా వృద్ధులకు సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. అంతేగాక సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు, దివ్యాంగులకు విద్య, వైద్య సేవలందిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయరంగ ప్రగతి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు.



ఆశ్రమ నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర రావు, క్రాంతి కిరణ్, బాలకృష్ణ, శ్రవణ్‌కుమార్, డాక్టర్ కె.పర్వతరెడ్డి, జీవీ వీరభద్రరావు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమాజ శాంతికి దైవ కార్యక్రమాలు దోహదం

ఆమనగల్లు: సమాజ శాంతికి దైవ కార్యక్రమాలు దోహదపడతాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహ దేవాలయ ఆవరణలోని పురాతన శివాలయాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు వెచ్చించి పునర్నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి ఆలయాన్ని వెంకటేశ్, నాగసాధువులతో కలిసి జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాగరణ కార్యక్రమంలో భాగంగా శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ సర్పంచ్ లలిత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ట్రస్టు సభ్యులు డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, బుచ్చిబాబు, టిప్పు సుల్తాన్ తదితరుల పాల్గొన్నారు.



శివాలయాన్ని ప్రారంభించిన జైపాల్‌యాదవ్

అన్నదానం మహాదానం



ఆమనగల్లు: భక్తులకు అన్నదానం చేస్తున్న దాత నారాయణరెడ్డి

ఆమనగల్లు: అన్నదానం మహాదానమని ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డిలు అన్నారు. తలకొండపల్లి మండలం మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి ఆలయం వద్ద గురువారం చుక్కాపూర్ గ్రామానికి చెందిన జక్కు శ్యామల, నారాయణరెడ్డి దంపతులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏటా అన్నదానం చేస్తున్న దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జగత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు నర్సింహ, యాదయ్య గౌడ్, యాదగిరి, జనార్దన్‌రెడ్డి, రాజలింగం, జగదీశ్వర్, చంద్రకుమార్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: శివరాత్రిని పురస్కరించుకుని గురువారం ఇబ్రహీంపట్నం పరిధి పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని సంగమేశ్వర ఆలయం వద్ద బీజేపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నాయిని రజని అన్నదానం చేశారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ పాల్గొని, పలువురికి భోజనం వడ్డించారు.



మాడ్గుల: అన్నదానం చేస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: భోజనం వడ్డిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మాడ్గులలో..

మాడ్గుల: మహాశివరాత్రిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొల్కులపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాగరణ భక్తుల కోసం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు, నిర్వహించారు.

కమనీయం.. కల్యాణోత్సవం



ఆమనగల్లు: పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



కడ్తాల్: పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు



కడ్తాల్: మైసిగండిలో శివపార్వతుల కల్యాణోత్సవ వేడుక

- అంగరంగ వైభవంగా కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు
- పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

ఆమనగల్లు/ కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం శివాలయంలో కొలువైన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఆలయంలో ఏకాదశ కలశాభిషేకం, వసంతోత్సవం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణలతో శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు, రథోత్సవాన్ని భక్తజన సందోహం మధ్య కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపల్లిగూడలో..

మంచాల: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో మంచి మార్పు తీసుకురావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధి తాళ్లపల్లి గూడలో శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారి రథోత్సవం ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.కె. భిక్షపతి ఎమ్మెల్యేను సన్మానించారు. వీఆర్‌వన్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వరరెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఐలయ్య, హరికిషన్, యాదయ్య, అనిత ఉన్నారు.

రాంనుంతలలో..

ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం అటవీప్రాంతంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం ఆలయ అర్చకుల నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం లింగోద్భవ కాలంలో త్రిపురాంతకేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. గురువారం ఉదయం నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమంలో భక్తులు నిప్పులపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఎన్‌టీ పంచాక్షరి, మల్లప్ప, యాదగిరిరెడ్డి, యాదయ్య, వీరయ్య, వైద్యనాథ్, శ్రీనునాయక్, పంతునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, యాదీలాల్, రాజేశ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందివనపర్తిలో..

యాచారం: మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు గురువారం నందివనపర్తి గ్రామం సిద్ధేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, అర్చన, నందివనపర్తి మాజీ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, రవీందర్‌రెడ్డి దంపతులు.. స్వయంభు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, కల్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మలి విడత కులగణనకు స్పందన కరువు

నేటితో ముగియనున్న గడువు

ఇబ్రహీంపట్నం: మలివిడత కులగణనకు ప్రజల నుంచి స్పందన కరువైంది. తొలివిడత కులగణనలో తప్పులున్నాయని వివిధ రాజకీయ పక్షాలు, కుల సంఘాలు విమర్శలు చేసిన నేపథ్యంలో.. ప్రభుత్వం మరోసారి సర్వేకు శ్రీకారం చుట్టింది. మొదటి దశ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో పాల్గొనని వారందరికీ మరో అవకాశం ఇచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి 28 వరకు చేపట్టనున్న సర్వేలో తమ కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. ఇందు కోసం ఆన్‌లైన్‌లో నమోదుతో పాటు, మున్సిపల్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాలకు నేరుగా వచ్చి దరఖాస్తులు చేసుకునే వెసలుబాటు కల్పించింది. ఈ గడువు ఈ నెల 28 శుక్రవారంతో ముగియనుంది. అయితే మొదటి దఫాలోనే ప్రజలందరూ కులగణన సర్వేలో పేర్లు నమోదు చేసుకున్నారా? లేక తమకేందుకులే అని ఉరుకున్నారేమోనన్న సంశయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చినా ప్రజల నుంచి సరైన స్పందన లేకపోవడం గమనార్హం. ఇబ్రహీంపట్నం మండలంలో కేవలం పొల్కంపల్లి, ఎల్మినేడు గ్రామాల నుంచి ఒక్కో దరఖాస్తు రాగా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నుంచి కేవలం ఆరు దరఖాస్తులు మాత్రమే కులగణన కోసం అందాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.